నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,27 జూన్ 2024


# సిటీ ఎమ్మెల్యేను కలిసిన సిఐటియు నేతలు



- కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కొండబాబు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ను సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి నేతృత్వంలో సిఐటియు నగర నాయకులు బుధవారం ఉదయం ఆయన నివాసంలో కలుసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బేబిరాణి మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జిజిహెచ్, నగర పాలక సంస్థ వంటి ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశా, విఓఎ, మధ్యాహ్న భోజన పథకం వంటి స్కీం వర్కర్స్ వేతనాలు, ప్రమోషన్లు, ఉద్యోగ భద్రత వంటి విషయాల్లో గత ప్రభుత్వానికి భిన్నంగా కార్మిక శ్రేయస్సు కోసం పనిచేయాలని కోరుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఆయా శాఖల మంత్రులు పూర్తి స్థాయిలో బాధ్యతలు తీసుకున్న తరువాత రంగాల వారీగా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, ఆశా వర్కర్స్ జిల్లా నేత చంద్రమళ్ళ పద్మ, మధ్యాహ్న భోజన పథకం నాయకురాలు నర్ల ఈశ్వరి, క్లాప్ వాహన డ్రైవర్ టి.శ్రీనివాస్, యు.పి.హెచ్.సి. ఎంప్లాయిస్ నాయకులు జి.వి.వి. సత్యనారాయణ, అంగన్వాడీ నగర నాయకులు రమణమ్మ, నీరజ, జ్యోతి, రమ, సరోజ, విజయ, ఆశా యూనియన్ నగర నాయకులు భారతి, పద్మ, పాప, రాణి, వేణు, లీలావతి, మీనాక్షి తదితరులు ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉన్నారు.

# ఇట్లు..మీ సేవకుడు మద్దిపాటి..!

- అన్ని వర్గాల సంక్షేమమే..నా ఎజెండా..
- ప్రజలు అందుకే నన్ను గెలిపించారు
- నాకు ఇచ్చిన అవకాశాన్ని నూరుశాతం ఉపయోగించుకుంటా
- మండల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వెంకట్రాజు
- ప్రమాణస్వీకారం తర్వాత నియోజకవర్గ కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే
- సమన్వయంతో పనిచేద్దాం..నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం..
- అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి ఉద్ఘాటన
- బ్రహ్మరథం పట్టిన కార్యర్తలు, నాయకులు, ఆయా శాఖలఅధికారులు



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** "ప్రజలు ఇచ్చిన ఆదరణతో ఎమ్మెల్యేగా గెలుపొందినా..నేను మీ సేవకుణ్ణే..సొంత గడ్డ రుణం తీర్చుకోవడానికి లక్షల ఉద్యోగాన్ని వదిలిపెట్టి మీ మధ్యకు వచ్చాను. నా ఆశకు అనుగుణంగానే నన్ను ఆదరించి ఎమ్మెల్యేగా చేశారు. మీకు సేవ చేయడానికి ఎప్పుడూ ముందు వరుసలో ఉంటా..శక్తి వంచనలేకుండా నా కర్తవ్యాన్ని నెరవేర్చుతా..ఎవరు ఏసమస్యాతో వచ్చినా పరిష్కరించ డానికి కార్యాలయ గేట్లు ఎప్పుడూ తెరిచే ఉంటాయి".
అని గోపాలపురం శాసనసభ్యుడు మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత తొలిసారి నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలో బుధవారం అడుగుపెట్టారు. తొలుత స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో తెదేపా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషిచేసారని..కష్టపడి పనిచేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అన్ని వర్గాల వారి సంక్షేమమే నా ముందున్న కర్తవ్యం అని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని చెప్పారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
విద్య, వైద్యం ఇతర అన్ని రంగాల్లో నియోజకవర్గం ముందు వరుసలో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మహిళల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని.. ఎన్నికల్లో అధికారం సాధించామని ధీమాతో ఉండకుండా మీ స్థాయిలో గ్రామాల్లో ఉండే సమస్యను నా దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, వడ్లమూడి రమేష్, జ్యేష్ఠ శ్రీనివాసరావు, నందమూరి సత్యనారాయణ, గంద్రోతు శ్రీనివాసరావు తదితురులు పాల్గొన్నారు.

**- సమన్వయంతో పనిచేద్దాం..** మండల స్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి ఉద్యోగుల వరకు అందరూ సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపిద్దామని అధికారులతో అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు సమావేశం అనంతరం మండల స్థాయి అధికారులు, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ఎవరూ తప్పు చేయాల్సిన అవసరం లేదని, నిజాయతీ, నిర్భయంగా పనిచేయాలని కోరారు. ఒత్తిళ్లతో కాకుండా స్నేహ భావంతో పనిచేసే అవకాశం తెదేపా ప్రభుత్వంతో ఉంటుందని భరోసా ఇచ్చారు. పేదల కష్టాలు తీర్చడానికి అధికారులు కృషి చేయాలని కోరారు. రెవెన్యూ, విద్య, ఆరోగ్య, పోలీసు శాఖల అధికారులు సేవగుణంతో పనిచేయాలని హితవు పలికారు.

**-మద్దిపాటికి బ్రహ్మరథం..** ప్రమాణస్వీకారం తర్వాత తొలిసారి గోపాలపురం వచ్చిన ఎమ్మెల్యే మద్దిపాటికి తెదేపా కార్యకర్తలు, నాయకులు, ఆయా శాఖల అధికారులు అపూర్వస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. మండల ప్రజా పరిషత్ , రెవెన్యూ శాఖ విద్యాశాఖ, పోలీసుశాఖ, ఉపాధిహామీ, ఐసీడీఎస్ వంటి శాఖల అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. పలువు ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టి తీసుకువెళ్లారు. అందరి సమస్యలు విన్న ఎమ్మెల్యే త్వరలోనే వాటిని పరిష్కరిస్తానని తెలిపారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- డాక్టర్ మానికి రెడ్డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మాదకద్రవ్యాల బారిన పడి యువత బంగారు జీవితాలను నాశనం చేస్తుకుంటున్నారని మానికి రెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సామాజికవేత్త డా.మానికిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా డా.మానికి రెడ్డి యువతకు ఒక పత్రిక ప్రకటన ద్వారా ఒక సందేశం తెలిపారు.మాదక ద్రవ్యాల నిరోధానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను తీసుకుని వచ్చాయని అయితే దొంగ చాటుగా ఈ మాదక ద్రవ్యాలు రవాణా అవుతూ పట్టణాల్లోను,పల్లెల్లోనూ విరివిగా దొరుకుతున్నాయని డా.మానికిరెడ్డి పేర్కొన్నారు.మత్తుతో మైమరిపించే ఈమాదక ద్రవ్యాలను ఒకసారి అలావాటుపడితే జీవిత కాలం దానికి బానిస కావడం ఖాయం అన్నారు. పరువు, ప్రతిష్ట, డబ్బుతోపాటు చక్కటి ఆరోగ్యం కూడా నాశనం అవుతుందని అన్నారు. గుట్కా, పాన్ పరాగ్, సిగరెట్లు, గంజాయి, కొకైన్, మద్యం వంటి మత్తు పదార్థాలను వాడటం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు, క్యాన్సర్ బారిన పడి అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. నగరాలకి పరిమితమైన ఈ మాదక ద్రవ్యాల వినియోగం పల్లెలకు కూడా విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది అన్నారు. తల్లిదండ్రులు యుక్త వయస్సు వచ్చిన తమ పిల్లలు నడవడిక గమనిస్తూ ఉండాలని, మత్తు పదార్థాల బారిన పడకుండా వారిపై దృష్టి సారించాలని డా.మానికి రెడ్డి తెలిపారు.

## కూరగాయల ధరలు అదుపులో ఉంచాలి

- సిపిఎం డిమాండ్




**కాకినాడ, మేజర్‌న్యూస్:** ఇటీవల విపరీతంగా పెరిగిన కూరగాయల ధరలను అదుపులో ఉంచాలని సిపిఎం డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవన్‌లో దుంపల ప్రసాద్ అధ్యక్షతన సిపిఎం నగర జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జీ మాట్లాడుతూ ఇటీవల అన్ని రకాల కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య మధ్యతరగతి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆకలి సూచికలో, పౌష్టికాహారంలో వెనుకబడిన మన దేశంలో నిత్యావసరాలు, కూరగాయల ధరల పెరుగుదల వల్ల ప్రజలు ఆహార స్వీకరణకు పరిమితులు విధించుకుంటున్నారని తెలిపారు. కార్మికుల వేతనాలు కంటే ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ధరల స్థిరీకరణ కొరకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. దళారీ వ్యవస్థ పై ఉక్కుపాదం మోపాలన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కూరగాయల ధరలు అదుపులో ఉంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు.
సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన సిపిఎం నాయకులు సి.హెచ్. సత్యనారాయణ రాజు, తూర్పుగోదావరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి బి. రాజులోవ, పార్టీ అభిమాని సావిత్రమ్మ లకు సంతాపం తెలిపారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు భవిష్యత్తు కర్తవ్యాలు ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు కె. నాగ జై, సిహెచ్. వేణు, మలక వెంకట రమణ, సూరిబాబు లతో పాటు సుబ్బారావు, స్వామి, వెంకట్రావు, హరనాధ్, ఏడుకొండలు, సతీష్, వాసు, సంజయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ






**కాకినాడ, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధించడం పై ప్రజలకు అవగాహన కల్పించు నిమిత్తం ఈ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించినారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుండి భానుగుడి సెంటర్ వరకు జరిగింది. సెబ్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి విద్యార్థులు అందరితోను మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించినారు. కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ మాదక ద్రవ్యాలకు దూరంగాఉండాలిఅని, సదరు మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి వార్కి కౌన్సిలింగ్ ఇచ్చి సరియైన మార్గం లోనికి తీసుకురావాలని అదే విధంగా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వారి సమాచారమును సంబంధిత కంట్రోల్ రూమ్ కు తెలుపవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి, డిస్ట్రిక్ట్ డ్రగ్ ఎడిక్షన్ సెంటర్ ఇన్చార్జి, సైకాలజిస్ట్ డా. సుందరరాజు, ఆదిత్య నర్సింగ్ కాలేజ్ డైరెక్టర్ డా. సుగుణ, గవర్నమెంట్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవిజి వర్మ, ఆర్కే నర్సింగ్ కాలేజ్ ఇంచార్జ్ జాన్ లివింగ్ స్టన్, శ్యాం ఇన్స్టిట్యూట్ పిఈటి కాంతారావు, ఆర్కే నర్సింగ్ కాలేజ్, ఆదిత్య నర్సింగ్ కాలేజ్, గవర్నమెంట్ ఐటిఐ, శ్యామ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థి, విద్యార్థినిలు, డిస్ట్రిక్ట్ డ్రగ్ ఎడిక్షన్ సెంటర్ సిబ్బంది, సెబ్, డార్ సిబ్బంది మరియు సివిల్ పోలీస్ సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అంధకారంలో గొల్లప్రోలు నగర పంచాయతీ

- సమావేశంలో సభ్యుల ఆగ్రహం



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** బుధవారం ఉదయం 11 గంటలకు గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం నందు చైర్ పర్సన్ గండేటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో వైయస్సార్ పార్టీకి చెందిన పలువురు సభ్యులు గొల్లప్రోలు పట్టణంలో దేవి నగరం, జగనన్న కాలనీ, సూరంపేట, పాపయ్య చావిడి వీధి, దళిత వాడలు, కొత్తపేట మెయిన్ రోడ్ ప్రాంతాలలో వీధిలైట్లు వెలగకపోవడం పై 12, 14, 13, 10 వార్డుల కౌన్సిలర్లు గొల్లప్రోలు నగర పంచాయతీ సభ్యుల సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తపరిచారు. తెలుగుదేశం పార్టీ 12వ వార్డు కౌన్సిలర్ గుల్ల సుబ్బయ్య నగర పంచాయతీ అధికారులు పట్టణవాసులకు సురక్షిత మంచినీరు అందడం లేదని ఆరోపించారు.
రంగు మారిన నీళ్లు కుళాయి ద్వారా పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ ఇంజనీరింగ్ సెక్షన్ అవినీతిమయంగా మారిందని సమావేశంలో ఇంజనీరింగ్ ఏఈ ప్రభాకరరావును నిలదీశారు. దీనిపై ఏఈ ప్రభాకరరావు, సంబంధిత అధికారులు సభ్యులకు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ భర్త పాలక మండలి సభ్యులు నగర పంచాయతీని అవినీతి పంచాయతీగా మార్చారని జన సైనికులు ఆరోపించారు.

## ఆటో బోల్తా... ఇరువురికి గాయాలు

**అంబాజీపేట,మేజర్‌న్యూస్:** కముజువారిలంక పంచాయతీ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడగా ఇరువురికి గాయలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట నుండి ముక్కామల వైపు పుస్తకాలలోడుతో ఉన్న ఆటోను, ప్యాసింజర్ ఆటో వెనుకనుండి ఢీ కొట్టిందన్నారు.
ఈ ప్రమాదంలో పుస్తకాలలోడు ఆటో బోల్తా కొట్టింది. ప్యాసింజర్ ఆటోలో ఉన్న ప్రయాణికురాలు నేలపూడి నిర్మలకు, ఆటో డ్రైవర్కు గాయాలు కావడంతో 108లో కొత్తపేట ఆస్పత్రికి తరలిచారని తెలిపారు.

## ఓడలరేవు బీవీసీలో 'మాదకద్రవ్యాల దుష్ప్రభావం' పై అవగాహన సదస్సు





**అల్లవరం, మేజర్ న్యూస్ :** స్థానిక బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినం సందర్భంగా వాటి వాడుక వలన కలిగే అనర్ధాలపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి వివిఎస్ఏ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. అధ్యక్షోపన్యాసంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రజలు ముఖ్యంగా యువత, విద్యార్థులు శరీర ఆరోగ్యాన్ని దారుణంగా దెబ్బతీసే మాదకద్రవ్యాలకు బానిసలు అవుతూ వారి ఆరోగ్యమును భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని యువత ఈ విషయంపై సరైన అవగాహన కలిగి మాదకద్రవ్యాల వాడుకకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కళాశాల సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీపాద రామకృష్ణ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాల కన్నా తీవ్రమైన ప్రభావం చూపించే మాదక ద్రవ్యాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 5.6 శాతం జనాభా అనగా 19 కోట్ల పైగా ఇలా వినియోగిస్తున్నట్లు అంచనాలతో ఇదొక పెను సమస్యగా పరిణమించిందనీ, మాదక ద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్స్టెన్సస్ చట్టాన్ని చేసిందని చెప్పి దానిపై అవగాహన కల్పించారు. వీటిని తీసుకున్నప్పుడు మనిషి వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఆలోచించేలా చేస్తాయనీ. నార్కోటిక్స్ ఉద్రేకాన్ని కలిగిస్తాయనీ, వీటికి అలవాటు పడటం వల్ల ఆకలి తగ్గి, నిద్ర పట్టక, జ్ఞాపక శక్తి తగ్గడం, నిద్రలో సమస్యలు, మానసిక ఒత్తిడి, మూడ్ స్వింగ్స్, అందరితో పోట్లాటలు చేస్తారని వివరించారు. పిల్లలు తల్లి తండ్రుల వద్ద ఉండకుండా చిన్న తనం నుండి వారికి దూరంగా ఉండి చదువుకోవడం, ఒత్తిడిని తట్టుకునేందుకు, మారుతున్న జీవన శైలి వల్ల డ్రగ్స్ వినియోగం యువతలో పెరిగినట్లు వివిధ నివేదికలు చెబుతున్నాయనీ, ఉమ్మడి కార్యాచరణ ద్వారా మాత్రమే దీనిని నియంత్రించగలమనీ సోదాహరణంగా తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.టి. నాయుడు, వివిధ శాఖల అధిపతులు కె.శివనారాయణ, డా.ఎస్.శ్రీకాంత్, ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, డా.ఆకుల ప్రవీణ్, డా.బి.ఎస్.ఎన్. మూర్తి, డా.పి.సుబ్బారావు, ఎ.దుర్గామాధురి, కార్యనిర్వహణాధికారి ఏ.వై.ఆర్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డయేరియా వ్యాధి నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణకు సమగ్ర కార్యచరణ ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు.
బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి.. వైద్య ఆరోగ్యం, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, జిల్లా పరిషత్, పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్, విద్య, మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, వెనకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం వసతి గృహాల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమం అమలు, జిల్లాలో డయేరియా వ్యాధిబారిన పడిన వారి వివరాలు, జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, మంచినీటి పరీక్షలు, తాగునీరు పైపులైన్ల తనిఖీ, లీకేజీలు, మరమ్మత్తుల పనులు, మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని పంచాయితీ, మున్సిపాలిటీలతో పాటు, అంగన్వాడి, వసతి గృహాలు, పాఠశాలలో డయేరియా వ్యాధి నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే జిల్లాలో కొమానపల్లి, బెండపూడి, వేట్లపాలెం గ్రామాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయని, ఈ ప్రాంతాల్లో డయేరియా వ్యాధి ప్రబలడాని కారణమైన అంశాలను, సేకరించిన తాగునీరు ఇతర నమూనాల వివరాలను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమం జిల్లాలో సక్రమంగా నిర్వహించేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా డయేరియా వ్యాధి ప్రబలకుండా కాచి చల్లార్చిన వేడి నీళ్లు తీసుకునేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. మరో దఫా అన్ని ప్రాంతాల్లో తాగునీరు పైపులైన్ల తనిఖీ చేసి లికేజీ, మరమత్తుల వివరాలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రాముఖ్యంగా జూలై 5 నాటికి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాల్లో తాగునీరు పరీక్షలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా జూన్ 30 నాటికి అన్ని ఇనిస్టిట్యూషన్స్ లో ఓఆర్ఎస్ ప్యాకెట్ల, జింక్ టాబ్లెట్స్ పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్టాప్ డయేరియా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జె.నరసింహ నాయక్, డిఐవో డా. రత్న కుమార్, జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్ర మూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య, డీఈవో పి.రమేష్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం శ్రీనివాసు, డీపీవో కె భారతి సౌజన్య, జిల్లా పౌర సంబంధాల శాఖ డీడీ డీ.నాగార్జున, సాంఘిక సంక్షేమశాఖ జేడీ డి.వి.రమణ మూర్తి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, బీసీ సంక్షేమ అధికారి ఎం లల్లి, డీటీడబ్ల్యూవో ఎం.విజయశాంతి, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ బెటర్మెంట్ స్టేట్ ర్యాంకర్స్‌ను అభినందించిన మంత్రి సుభాష్



రామచంద్రపురం, మేజర్ న్యూస్ : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ బెటర్‌మెంట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపించి రాష్ట్ర స్థాయి ర్యాంక్ లు సాధించిన మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థులను మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన అభినందన సభలో అభినందించారు. ఈ సందర్బంగా మినిస్టర్ సుభాష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో ర్యాంకర్స్ గా తీర్చిదిద్దుతున్న మోడరన్ విద్యాసంస్థల కృషి అభినందనీయం అని అన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్బంగా మోడరన్ అధినేత లయిన్ జి.వి.రావు మాట్లాడుతూ తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి పట్టణంలో సరికొత్త చరిత్ర సృష్టించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్ మాట్లాడుతూ..ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను పి.భారతి 466, డి.నీరజ 465, బి.తరుణ్ కుమార్ 464, డి.శ్రీ అంజి 464, జి.సాయిదుర్గ 464, బి.జస్వంత్ 463, ఎస్.కీర్తన 463, కె.కీర్తిక 462, పి.వీరేంద్ర 462, పి.తనూజ -462, టి.సోఫియా 462, ఎం.మహతి 460, అలాగే బైపీసీ గ్రూపులో షేక్, అహ్మద్ అశ్వక్ 427, పి.ఎల్.ఎస్. శ్రావ్య 426, బి.చాందిని 421, పి.భవాని -420, సిఈసిలో కె.వి.వి.ఎస్. రమ్య దుర్గ 485, ఎంఈసిలో జి.వి.డి. జయ చంద్రిక 484 మార్కులు సాధించారని తెలిపారు. విజేతలను మోడరన్ అధినేత లయిన్ జి.వి. రావు, ప్రిన్సిపాల్ సి. హెచ్. రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్. ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సి. హెచ్. శ్రీనివాస్, మోడరన్ సిబ్బంది అభినందించారు.

## అగ్నిప్రమాద బాధితులకు జనసైనికులు ఆర్థిక సహాయం



గొల్లప్రోలు, మేజర్ న్యూస్ : గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. దీనిపై పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు నక్క శ్రీనివాస్ బద్రి అగ్ని ప్రమాద బాధ్యత కుటుంబాల్ని పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా బాధిత కుటుంబానికి రావలసిన అన్ని బెనిఫిట్స్ వచ్చేలా పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మరిరెడ్డి శ్రీనివాస్, పిఠాపురం శాసనసభ్యులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని అగ్ని బాధ్యత కుటుంబానికి జనసైనికులు హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొడవలి జనసేన పార్టీ అధ్యక్షుడు నక్క నారాయణమూర్తి, గొల్లప్రోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అమరవల్లి రామకృష్ణ, చిన్న జగ్గంపేట మాజీ సర్పంచ్, జనసేన పార్టీ నాయకుడు సారిపల్లి నాగేశ్వరరావు, మలిరెడ్డి గంగబాబు, బస్సు రాజా, బస్సా చిట్టిబాబు, వీర మహిళలు కోలంక గౌరీ, గరగ తాతాజీ, గొల్లపల్లి గంగ, మోరుకుర్తి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
గురువారం
27 జూన్ 2024


### ఎమ్మెల్యే ఆనందరావుకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపిడిఓ, కార్యదర్శులు



**అల్లవరం, మేజర్ న్యూస్ :** శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు పుట్టినరోజు సందర్భంగా అల్లవరం ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్, పంచాయతీ కార్యదర్శులు వారిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్, కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు, మృదుల, జ్యోతి, వీర బాబు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ ర్యాలీ



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మత్తు పదార్థాల వినియోగంతో నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడి అనారోగ్యం బారిన పడతారని, మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం చేసుకోవద్దని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్ కుమార్, ఎంపీడీఓ జి.వి.సరోవర్, తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. అంబాజీపేటలో ఎస్సై కె.చిరంజీవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్ఎవీఎం విద్యార్థులచే అవగాహన ర్యాలిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలో పిహెచ్‌సి కె.ఎస్.శ్రీనివాస్, సీహెచ్వ బి.అప్పారావు, ఎస్ఎవీఎం కళాశాల కరస్పాండెంట్ ఎం.సాయిప్రసాద్, ప్రిన్సిపల్ ఎస్.రాధామణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతానికి పాలకులం కాదు, సేవకులమే!

- విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే శిరీష దేవి
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పసుపు మయంగా మారిన ఏజెన్సీ గ్రామాలు





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గిరిజన ప్రాంతానికి తన శాయిశక్తులా సేవలు అందించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రంపచోడవరం నూతన ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. ఏపి అసెంబ్లీలో శాసన సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసి రంపచోడవరం నియోజకవర్గానికి బుధవారం వచ్చిన మిరియాల శిరీషాదేవికి తెదేపా, భాజాపా, జనసేన కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తొలుత సీతపల్లి వద్ద మాతృశ్రీ గడి బాపనమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శిరీష దేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటరాగా రంపచోడవరం ప్రధాన కూడలికి చేరుకున్నారు. అక్కడ డా. బి.ఆర్.అంబేద్కర్, నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుమారు 15 సంవత్సరాలు తర్వాత రంపచోడవరం నియోజకవర్గంలో తెదేపా పార్టీ జెండా ఎగిరిన నేపథ్యంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీకి ప్రజల్లో విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే శిరీషాదేవిని, ఆమె భర్త మఠం విజయ్ భాస్కర్ ను పార్టీ శ్రేణులు క్రేన్ ద్వారా గజమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం గంగవరం, అడ్డతీగల మండలాల మీదుగా రాజవొమ్మంగి వరకూ విజయోత్సవ ర్యాలీ కొనసాగింది.

రంపచోడవరం మండలంలో..తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి నాయకులు ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీ సందర్భంగా బాపనమ్మ తల్లి గుడి వద్దకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకొన్నారు. మొదటిగా అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి దర్శించుకొన్న అనంతరం అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి రంపచోడవరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా నడుచుకుంటూ బాణా సంచా కాల్చుతూ తీన్మార్ డప్పులతో స్థానిక ప్రధాన రహదారి కూడలి వద్దకు చేరుకుని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, తెలుగుదేశం పార్టీ వ్యవస్థపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన ప్రజలకు పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని, ప్రజలు వారి సమస్యలపై ఎప్పుడైనా కలిసి తమతో పని చేయించుకోవచ్చునని, పాలకుల మాదిరిగా కాకుండా సేవకులుగా విలువలతో పనిచేస్తామన్నారు. తర్వాత అక్కడ నుంచి ర్యాలీగా గంగవరం చేరుకొని అక్కడ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమం ముగిసిన తరువాత అక్కడ నుంచి ర్యాలీగా ప్రధాన రహదారిపై పెద్ద అడ్డపల్లి , చిన్న అడ్డపల్లి , ఏటిపల్లి గ్రామాలు చేరుకొని అక్కడ నాయకులు, కార్యకర్తలతో కలిసి విందులో పాల్గొన్నారు. అనంతరం మొదలైన ర్యాలీ జడేరు జంక్షన్ నుండి వేటమామిడి తదితర గ్రామాల్లో ప్రజలకు అభివాదం చేస్తూ అడ్డతీగల మండల ప్రధాన కేంద్రానికి చేరుకొని అక్కడ పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అడ్డతీగల గ్రామంలోని ప్రధాన పుర వీధుల్లో భారీ ఎత్తున ప్రజలు ఎమ్మెల్యే శిరీష దంపతులకు ఘన స్వాగతం పలికారు. పవనగిరి ఆలయం అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు ఘనంగా శాలువతో సత్కరించారు. ఇదే నేపథ్యంలో అడ్డతీగల ప్రధాన రహదారిపై మహిళలు హారతులు పట్టి, కాళ్ళు కడిగి ఇద్దరినీ ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే శిరీష విజయ బాస్కర్ డాక్టర్ అంబెడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అడ్డతీగల నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు తదనంతరం అక్కడ కార్యక్రమం ముగించుకుని అక్కడ నుండి బయలుదేరి భీముడు పాకలు, పాపంపేట, చెనుపాకలు, రాజంపాలెం, వీరభద్రపురం, కోనలోవ, గౌరీపేట మీదుగా చెరుకుంపాలెం వయా జడ్డంగి చేరుకొని జడ్డంగి పొలిమేర ప్రధాన రహదారిపై నుండి ర్యాలీగా నడుచుకొంటు జడ్డంగి స్థానిక వాల్మీకి నగర్‌లో రామాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడ వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. తరువాత అక్కడ నుండి సింగంపల్లి, ఒట్టిగడ్డ, దూసరపాము గ్రామాల్లో ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించుకొంటూ రాజవొమ్మంగి మండల ప్రధాన కేంద్రానికి చేరుకున్నారు. ఈ విజయోత్సవ ర్యాలీ కార్యక్రమాల్లో రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ రాష్ట్ర, పార్లమెంట్, జిల్లా, నియోజకవర్గం, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గాయపడిన పాముకు చికిత్స



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం ప్రధాన రహదారి పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతూ వాహన ప్రమాదానికి గురైన పామును అటవీ అధికారులు రక్షించారు. బుధవారం ప్రధాన రహదారిలో అలజడి సృష్టించిన పామును చూసి స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఆ ప్రదేశానికి వచ్చి గాయపడిన పామును సురక్షితంగా పట్టుకొని చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు పశువైద్యశాలకు తరలించారు కాగా 12 అడుగులు పొడవు గల ఈ పాము కొండ సిలువ జాతికి చెందినదిగా స్థానికులు పేర్కొం టున్నారు. స్థానికులకు పాముకు ఎలాంటి ప్రమాదం కలుగకుండా చాక చక్యంగా బంధించిన అటవీ అధికారులను ఈ సందర్భంగా స్థానికులు అభినందించారు.

## పేరవరంలో విద్యాప్రదేశ్ ర్యాలీ..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామంలో విద్యాప్రవేశం కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ 2 వరలక్ష్మి ఆధ్వర్యంలో ప్రాథమికొన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించి విద్య ఆవశ్యకత తెలియజేస్తూ ఇంటింటికి వెళ్లి విద్యార్థులను బడికి రప్పించుట, అలాగే నమోదు చేయుట జరిగింది బడి ఈడు కలిగిన పిల్లలందరినీ బడిలో నమోదు చేయవలసిందిగా తల్లిదండ్రులను కోరడమైనది ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వివిధ రకాల వస్తువుల వివరాలు అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులు కే గంగాభవాని పి శ్రీనివాసరావు ఉపాధ్యాయులు సుందర్రావు, శ్రీను, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

## జ్వర పీడుతులను పరామర్శించిన ఎమ్మెల్యే గిడ్డి



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు ఆయన పి.గన్నవరం మండలంలోని బెల్లంపూడి గ్రామంలో జ్వర పీడితులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఎమ్మెల్యే వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ముమ్మరంగా శానిటేషన్ పనులను నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో డ్రైనేజీ ఆధునికీకరణ, ప్రజలందరికీ సురక్షితమైన త్రాగునీరు పంపిణీ చేసేందుకు తగు చర్యలు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎం అండ్ హెచ్వో సిహెచ్.వి భరత లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ బెల్లంపూడి గ్రామంలో సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరాల బారిన పడిన వారికి ఔషధాలను, వైద్య సలహాలను ఇస్తున్నామని తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మాతా చిన్న(55) అనే వ్యక్తి ఇటీవల కామెర్ల వ్యాధితో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి త్రిశూలపాణి, ఆదిమూలం వేంకటేశ్వర రావు, అడబాల శ్రీను, అనిశెట్టి శేషారావు, వానపల్లి బుజ్జి, దిరిసాల సుధాకర్, బండి రమేష్, కే. మణి సాయి, తదితరులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించిన కూనవరం పోలీసులు



**కూనవరం, మేజర్ న్యూస్ :** యువత గంజాయి మాదకద్రవ్యాలు పట్ల ఆకర్షితులు కావద్దని మంచి ప్రవర్తనతో మెలగాలని పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ ఓ ఎస్ డి ఆదేశాల మేరకు మండల కేంద్రమైన కూనవరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కూనవరం ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.


### సమాజానికి చేటు చేసే మాదకద్రవ్యాల నిరోధమే లక్ష్యంగా పనిచేస్తాం

- సీఐ సన్యాసినాయుడు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** సమాజానికి చేటు చేసే మాదకద్రవ్యాల నిరోధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కాలం రాజువామింగ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ సన్యాసినాయుడు అన్నారు. బుధవారం యాంటీఅంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం పురస్కరించుకొని రాజవొమ్మంగి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్, కళాశాల విద్యార్థులతో స్థానిక గాంధీ సెంటర్ నుండి ఆర్ అండ్ బిగెస్ట్ హౌస్, అల్లూరు జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. అల్లూరు జంక్షన్ వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. సిఐ సన్యాసి నాయుడు నాయుడు విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, కేసులు - వాటి పర్యవసానాలు అవగాహన కల్పించారు. మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి అధిరోహించాలని ఆకాంక్షించారు. ర్యాలీలో మాదకద్రవ్యాలు వినియోగం వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ సన్యాసి నాయుడు, స్థానిక ఎస్సై వెంకయ్య, పాఠశాల హెచ్ఎం గోపాలకృష్ణ, అటవీ అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వరుపులకు అపూర్వ స్వాగతం..



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్:** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు దేశం బరిలో దిగి అత్యధిక మెజారిటీతో గెలుపొందిన వరుపుల రాజా సతీమణి సత్య ప్రభ ప్రమాణ స్వీకారం అనంతరం నియోజకవర్గంలో కృతజ్ఞతా పర్యటన చేపట్టారు. నియోజకవర్గ పరిధిలోని ఏలేశ్వరం మండలంలో బుధవారం పర్యటించారు. తొలుత ఎర్రవరంలో దేశం పార్టీ నాయకులు ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో ఆమెకు అపూర్వ స్వాగతం లభించింది. ఆమె వెంట కూటమి నేతలు వరుపుల తమ్మయ్య బాబు మీసాల రాజు తదితరులు ఉన్నారు. ఏలేశ్వరం లింగంపర్తి మీదుగా పత్తిపాడు మండలం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు తాను ఎంతో రుణపడి ఉన్నానని తమపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించిన వాటర్ లకు శిరస్సు వంచి పాదాభివందనం తెలియజేస్తున్నాం అన్నారు. ప్రధానంగా యువత మహిళలు ఉద్యోగ ఉపాధ్యాయ వ్యవసాయ కార్మిక సంఘాలు తమకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చి ముందుకు నడిపించారని వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. దేవాంగత నేత ఓరుపుల రాజా ఆశయాలు మేరకు తాను రాజకీయాల్లోకి వచ్చానని ఆయన ఆశయాలు నెరవేర్చి ఎందుకు శక్తివంచలు లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు. నియోజవర్గ నాలుగు మండలాల్లోనూ ఏ సమస్యలున్న తామ దృష్టికి వస్తే వెంటనే స్పందించి అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రహదారులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానన్నారు.

# వాడపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే బండారు




**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వెంకటేశ్వరస్వామి వెలిసి యున్న వాడపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం వాడపల్లి ఆలయంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది వేదమంత్రాలతో మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అర్చకులు బండారుచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలో వసంత మండపం నందు ఎనిమిది లక్షల 50 వేల రూపాయలతో చేసిన గ్రానైట్ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న కోనేరును సందర్శించి ఇంజనీరింగ్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కోనేరు నిర్మాణం జరపాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వాడపల్లిలో జరిగిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధితో పాటు పుణ్యభూమిగా ఉన్న వాడపల్లి గ్రామంలో మౌలిక వసతులు కల్పించి అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. గ్రామస్తుల నుంచి గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తపేట నియోజకవర్గం నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావును గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), నాయకులు కరుటూరి నరసింహారావు, తోటకూర సుబ్బరాజు, కాయల జగన్నాథం, ముళ్ళపూడి భాస్కరరావు, మెర్ల రాము, మండల జనసేన ఉపాధ్యక్షులు బండారు బాబి, రెడ్డి తాతాజీ, పాలింగి రవిచంద్ర పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- ప్రభుత్వ ఆసుపత్రిలో బర్త్ రేట్ పెరగాలి
- ఆరోగ్యకర రాజమండ్రే మన ధ్యేయం కావాల
- రేడియాలజిస్ట్‌ను ఏర్పాటు చేసి సీటీ స్కార్‌ను అందుబాటులోకి తెస్తాం
- ఆశ వర్కర్ల సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆశ వర్కర్లు తన దృష్టికి తీసుకు వచ్చిన ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఆయన ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆశ వర్కర్లు తమ సమస్యలను విన్నవించారు. గర్భిణీలను తీసుకువస్తున్న తమకు ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు కల్పించడం లేదని, కనీసం కూర్చునేందుకు కూడా అవకాశం ఇవ్వడం లేదన్నారు. అసలు తమను లోనికే రానివ్వడం లేదని, గర్భిణీలు కానీ బాలింతలకు కానీ ఏ సమయంలో పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదని, సీరియస్‌గా ఉన్నప్పుడు తీసుకువస్తే ఇప్పుడెందుకు తీసుకువచ్చారు మీరు ఫలానా రోజు రావాలి కదా అంటూ గదమాయించి పంపేస్తున్నారని ఆశ వర్కర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమను గైనకాలజీ బ్లాక్‌లోకి అనుమతించాలని, అలాగే గర్భిణీలకు ట్రీట్‌మెంట్ జరుగుతున్న సమయంలో తాము విశ్రాంతి తీసుకునేందుకు ఒక గది కేటాయించాలని కోరారు. ఆశ వర్కర్ల వినతిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ఆరోగ్యకర రాజమండ్రి మన ధ్యేయమని, అందుకు అందరూ సహకరించాలన్నారు. తన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి ఈ ఆసుపత్రిలో ప్రత్యేకంగా గైనకాలజీ విభాగాన్ని ఏర్పాటు చేయించారని గుర్తు చేసుకున్నారు. గర్భిణీలను క్షేమంగా ఆసుపత్రికి తీసుకువచ్చి తిరిగి వారి గమ్యాలకు చేర్చే బాధ్యత ఆశ వర్కర్లదేనని అన్నారు. ఆసుపత్రిలో బర్త్ రేట్ తగ్గిందని సూపరింటెండెంట్ వారు చెబుతున్న నేపథ్యంలో ఆ రేటును పెంచాలని సూచించారు. ప్రతి 15 రోజులకు తాను ఆసుపత్రిలో సమావేశం నిర్వహిస్తానని, రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరుగు తుందన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం అందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. అనంతరం సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్య ప్రభ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు గర్భిణీల పట్ల తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను సూచించారు. ఆశ వర్కర్ల కోసం ఒక గదిని కేటాయించడం జరుగుతుందని, అయితే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా యూనిఫామ్ ధరించి గుర్తింపు కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా లక్ష్మి సూర్యప్రభ , డిఎం అండ్ హెచ్ఓ డా కె. వెంకటేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆరు రైతు బజారుల ద్వారా కిలో రూ.50 కే టమాటా



- ప్రతీ కుటుంబానికి రెండూ కిలోల చొప్పున అమ్మకాలు జరుపుతున్నాం
- జిల్లాలో ధరల నియంత్రణ కోసం అవసరమైన చర్యలు
- ఇన్చార్జి కలెక్టర్ ఎన్ తేజ్ భరత్

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** సీజనల్ పరిస్థితుల దృష్ట్యా మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరగడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు టమోటా ను సబ్సిడీపై కిలో రూ.50 లకే జిల్లాలోని ఆరు రైతు బజారు ల ద్వారా బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకుని రావడం జరిగిందని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ తెలియ చేశారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న రైతు బజారులో సబ్సిడీ ద్వారా టమోటా అమ్మకాలని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజ్ భరత్ మాట్లాడుతూ, కూరగాయల ధరలు పెరగడం పై రెండు రోజుల క్రితం సమన్వయ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, కూరగాయల ధరలు నియంత్రణ పై చర్చించడం జరిగిందన్నారు. టమోటా కిలో రూ.70 లు, ఉల్లిపాయలు కిలో 40 లకు చేరిన ధరలను నియంత్రణ పై మార్క్ఫెడ్, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా "పుంగనూరు" నుంచి ఐదు మెట్రిక్ టన్నుల టమాటా జిల్లాకు దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. గ్రేడ్ వన్ రకం టమాటా కేజీ ఒక్కంటికి రూ.50 లు చొప్పున ప్రతీ కుటుంబానికి రెండు కిలోల చొప్పున అమ్మకాలు జరుపుతున్నట్లు ఆయన తెలియ చేశారు. జిల్లాలోని ఆరు రైతు బజారు ల ద్వారా సబ్సిడీ ద్వారా నాణ్యమైన గ్రేడ్ వన్ టమోటా అమ్మకాలు జరుపుతున్నట్లు, నగరంలోని ఐదు, కొవ్వూరు లోని ఒక రైతు బజారు లో సబ్సిడీ టమోటాలను వినియోగదారు లకి అందుబాటు లోకి తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. ప్రతి రెండూ రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించి సరఫరా చేసే ప్రాంతాలను గుర్తించి అక్కడ నుంచి ఆమేరకు సరుకును తీసుకుని రానున్నట్లు తెలిపారు. తద్వారా లభ్యత పెరగడం వలన రానున్న రోజుల్లో ధరలను నియంత్రణ చెయ్యడం సాధ్యం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగు ఏ డీ ఎమ్. సునీల్ కుమార్, రైతు బజారు ఎస్టేట్ అధికారులు, రైతులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.


### భూములు కౌలుహక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

దేవదాయ ధర్మదాయశాఖ, కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం దేవాలయములకు సంబంధించిన భూములు ఈ క్రింది షెడ్యూలు దాఖలా 3 సం॥ముల కాలపరిమితికి అనగా 2024-25 సం॥ము నుండి 2026-2027 సం॥ము వరకు కౌలు హక్కునకు దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో టెండర్-కమ్- బహిరంగ వేలము జరుపబడును. ఆసక్తి గలవారు కౌలు షరతులు పాటించి బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

| వ. నెం. | దేవస్థానం పేరు గ్రామం | సర్వే నెం. | విస్తీర్ణము య. ట్లు | భూమి స్వభావం | ధరావత్తు | బహిరంగ వేలం జరుగు స్థలం, తేది, సమయం |
|---|---|---|---|---|---|---|
| 1. | శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, మల్లేపల్లి గ్రామం, గండేపల్లి (మ) | | | | | |
| | నిడిగట్ల | 120/2 | 4-20 | పల్లం | 10,000/- | ది.05-07-2024 ఉదయం గం.10.00లకు గ్రామ పంచాయితీ కార్యాలయం, నీడిగట్ల గ్రామం వద్ద |
| 2. | శ్రీ చంద్రశేఖర స్వామి వారి దేవస్థానం, గండేపల్లి గ్రామం, గండేపల్లి (మ) | | | | | |
| | గండేపల్లి (వి) | 105/11 | 3-00 | పల్లం | 20000/- | ది.05-07-2024 మధ్యాహ్నం గం.02.00లకు శ్రీ స్వామి వారి దేవస్థానంవద్ద |
| | | 122/1 | 4-59 | పల్లం | 20000/- | |
| | | 53/1<br>53/4 | 0-13<br>0-75 | పల్లం<br>పల్లం | 20000/- | |
| | | 95/4 | 1-02 | పల్లం | 20000/- | |
| | | 135/1 | 3-44 | పల్లం | 20000/- | |
| | | 386 | 1-44 | పల్లం | 20000/- | |
| | కె. గోపాలపురం | 5/1<br>22/1 | 3-45<br>3-67 | పల్లం<br>పల్లం | 20000/- | |

ముఖ్య షరతులు :

1) ఈ బహిరంగ వేలం దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షములో దేవాదాయ ధర్మదాయశాఖ అధికారుల ఆమోదమునకు లోబడి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడును.
2) పాటదారులు పాటలో పాల్గొనుటకు ముందుగా ఐడెంటిటీ ప్రూఫ్ (అనగా ఆధార్ కార్డు, రేషన్‌కార్డు) ఏదైనా చూపించి పాటలో పాల్గొనవలెను. సదరు పాట నందు హిందువులు మాత్రమే పాల్గొనవలెను.
3) పాట కొట్టివేసిన వెంటనే హెచ్చు పాటదారుడు హెచ్చు పాట పాడిన ఒక సంవత్సరం శిస్తు అడ్వాన్సుగా చెల్లించు నిర్ణయం.
4) ఈ వేలంను ఏ కారణం తెలుపకమే రద్దుచేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని, మార్పుచేయుటకు గాని దేవస్థానం అధికారులకు అధికారము కలదు.
5) మిగిలిన వివరములు కార్యాలయపు పనివేళలో తెలుసుకొనగలరు.

కార్యనిర్వహణాధికారి
సెల్ నెం. 96521 24713.

స్థలం : గండేపల్లి తేది: 26-06-2024.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే



**– జిల్లా అభివృద్ధికి కలిసి పని చేద్దామన్న కొండబాబు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన షాన్ మోహన్ సగిలి ని బుధవారం ఆయన ఛాంబర్‌లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కలిశారు. కలెక్టర్‌కి మొక్కని అందించి ఆయనకు శుభాకాంక్షలు కొండబాబు తెలియజేశారు. విశ్రాంత ఉద్యోగుల స్వర్గధామంగా, పారిశ్రామిక అభివృద్ధి కేంద్రంగా, ప్రశాంత వాతావరణంగా ఉండే కాకినాడ జిల్లా అభివృద్ధికి కలిసి పని చేద్దామని కొండబాబు అన్నారు.

## కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి మౌలిక సదుపాయాలు కల్పించాలి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని దీనికి నిధులు మంజూరు చేయాలని బుధవారం జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్‌ను కలిసి వినతి పత్రం అందించినట్లు జిల్లా యువజన సంఘంల కార్యదర్శి మరియు జిల్లా ఆర్టీఐ మెంబర్ గేదెల శ్రీనివాస్ తెలిపారు. సందర్భంగా జిల్లా కలెక్టరుకు వివరిస్తూ కాకినాడ ప్రభుత్వ హాస్పటల్ కొన్ని మౌలిక వసతులకు నిధులు మజూరు చేసి ప్రజలకు మెరుగైన అయిన వసతులు కావాలని కోరారు. ఎమర్జన్సీ వార్డ్‌ని విస్తరించాలని కోరాగా అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని గేదెల శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు.

# బాడీ ఫ్రీజర్ బాక్స్, సిమ్మెంట్ బెంచీలు జాతికి అంకితం

**– దాతలు పచ్చిగోళ్ళ సత్యనారాయణ, పచ్చిగోళ్ళ రాధాకృష్ణలకు ఘన సన్మానం**

**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం చిరుతపూడి శివారు చిట్టిచెర్వుగట్టు గ్రామంలో ఇళ్ళ ఏడుకొండలు మరియు ఎల్.ఆర్.కె. మూర్తి మరియు చిట్టుచెర్వు గట్టు గ్రామ పెద్దల పర్యవేక్షణలో ఆఖరి నిద్ర (ఉచితం) అనే పేరుతో ఒక లక్షరూపాయుల విలువ గల బాడీ ఫ్రీజర్ బాక్స్ మరియు ఒక లక్షా ఇరువదివేల రూపాయులతో తయరుచేసిన ముప్పై సిమ్మెంట్ బెంచీలు అమలాపురం పట్టణానికి చెందిన డాక్టర్ పచ్చిగోళ్ళ సత్యనారాయణ మూర్తి, రోహిణి దంపతుల జ్ఞాపకార్ధం వారి కుమారులు పచ్చిగోళ్ళ సత్యనారాయణరావు (సతీష్) మరియు పచ్చిగోళ్ళ రాధాకృష్ణ (కృష్ణ) ఆర్ధిక సహకారంతో సమకూర్చిన బాడీ ఫ్రీజర్ బాక్స్ మరియు ముపై సిమ్మెంట్ బెంచీలును ప్రారంబోత్సవానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆస్థాన శిల్పి, కళారత్న, హంస అవార్డు గ్రహీత, ఆచార్య దేవ డి.రాజ్ కుమార్ ఉడయార్ జాతికి అంకితం చేసారు.

ఈ సందర్భంగా రాజ్ కుమార్ ఉడయార్ మాట్లాడుతూ ప్రతీ మనిషి జీవితంలోనూ అతి ముఖ్యమైన యాత్ర అంతిమ యాత్ర అని సుదీర్ఘ



ప్రాంతాలలో ఉన్న మరణించిన వ్యక్తి బంధువులు మృతుని అంతిమ యాత్రలో పాల్గొనడానికి ఆలస్యమయ్యే పరిస్దితులో ఈ బాడీ ఫ్రీజర్ బాక్సు పాత్ర అతి ముఖ్యమైనదని ఈ పరికరానికి ప్రవేటు నిర్వాహకులు రోజుకు వేలాది రూపాయులు తీసుకుంటున్నారని అటువంటి పరిస్దితిని నివారించి గత 10 సంవత్సరాల నుండి ఇళ్ళ ఏడుకొండలు, ఎల్.ఆర్.కె. మూర్తి నిర్వాహణలో మూడు బాడీ ఫ్రీజర్ బాక్సులు ఈ గ్రామంలోనే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల వారు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారని అదే విధంగా అతి ముఖ్యమైన అంతిమ యాత్ర అనంతరం దహన సంస్కారాలకు ఈ గ్రామంలో తన సొంత సొమ్ములతో వారి తల్లితండ్రులు ఇళ్ళ మీరాసాహెబ్, ఇళ్ళ కామేశ్వరి జ్ఞపకార్ధం శ్మశానవాటిక ఏర్పాటు చెయ్యడమే కాకుండా ఇటీవల కాలంలో శ్మశాన వాటికలో అత్యద్భుతమైన సౌకర్యాలు ఇళ్ళ ఏడుకొండలు కుటుంబం ఏర్పాటు చేసారని, ఇళ్ళ ఏడుకొండలు, మూర్తి సేవలను ఇతర గ్రామల వారు కుడా ఆచరిస్తే అద్భుతమైన సేవ చెయ్యవచ్చని అన్నారు. అనంతరం దాతలు పచ్చిగోళ్ళ సత్యనారాయణ (సతీష్), పచ్చిగోళ్ళ రాధాకృష్ణ (కృష్ణ) ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ మాజీ ప్రతిపక్ష నేత రెడ్డి రామకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ దళిత రత్న అవార్డు గ్రహీత నేదునూరి వీర్రాజు, చిరతపుడి సర్పంచ్, ఉప సర్పంచులు కోట బేబీరాణి, చింతపల్లి షన్ముఖ వెంకటలక్ష్మి, చిరుతపూడి గ్రామ మాజీ సర్పంచ్ పిల్లా ఏసుబాబు, చిరుతపూడి మాజీ ఎంపిటిసి సభ్యులు రంపం సత్యవతీ వీరబద్రరావు, మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్దాపక అద్యక్షులు కోరుకొండ జాన్, టిడిపి గ్రామశాఖ అద్యక్షులు దాసరి వీరబాబు, జనసేన గ్రామశాఖ అద్యక్షులు సూరిశెట్టి నాగరాజు, డాక్టర్ రుద్రరాజు, వైసిపి గ్రామఖాఖ అద్యక్షులు గుత్తుల వెంకటేశ్వరరావు తదితురులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జీ తెలుగు అందిస్తున్న వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ ఊరు పేరు భైరవకోన

**– ఈ ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు..**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జీ తెలుగు ఈ ఆదివారం మరో సూపర్ హిట్ హారర్ థ్రిల్లర్‌తో మీ ముందుకు రాబోతోంది, ఆసక్తికరమైన కథాంశంతో మిస్టరీ, అడ్వెంచరస్ హారర్ మూవీగా రూపొందిన ఊరు పేరు భైరవకోన జూన్ 30, ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు మీ జీ తెలుగులో ప్రదర్శన కానుంది. 'ఊరు పేరు భైరవకోన' సినిమా కథ బసవ పాత్ర చుట్టూ తిరుగుతుంది బసవ (సందీప్ కిషన్) తన స్నేహితుడు జాన్ (వైవా హర్ష)తో కలిసి ఓ దొంగతనం చేస్తాడు. ఈ క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకుంటూ అనుకోకుండా భైరవకోన అనే ఊరిలోకి వస్తారు అయితే, ఈ ఇద్దరితో పాటు గీత (కావ్య థాపర్) కూడా ఆ ఊళ్ళోకి వస్తుంది. ఇంతకే, ఆ భైరవకోన ఊరు ప్రత్యేకత ఏంటి ?, అక్కడ కనిపించే మనుషులు ఎవరు? గరుడ పురాణంలో కనపడకుండా పోయిన నాలుగు పేజీలకి భైరవకోనకి మధ్య ఉన్న సంబంధం ఏంటి? అనే విషయాలు తెలియాలంటే ఊరు పేరు భైరవకోన సినిమా చూడాల్సిందే..! ప్రధాన నటీనటుల అద్భుతమైన నటన ఆకట్టుకునే కథాంశంతో ఫాంటసీ, డ్రామాగా ప్రేక్షకులను అలరించేందుకు 'ఊరు పేరు భైరవకోన' సిద్ధమైంది. విఐ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ, కావ్య దాపర్ ప్రధాన పాత్రలు పోషించగా, వైవా హర్ష, వెన్నెల కిషోర్, పి. రవికుకర్ ఇతర కీలకపాత్రలు పోషించారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

**– ఎంపీడీవో**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** వర్షాకాలంలో ప్రభలే సీజన్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయములో అంగన్‌వాడీ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా క్లోరినేషన్ చేసిన తరువాతే ప్రజలకు తాగునీటిని పంపిణీ చేయాలని, పైపు లైన్లు లీకేజీ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతీ గ్రామములో అంగన్‌వాడీ సెంటర్లు పరిశుభ్రతగా ఉంచాలని, అంగన్‌వాడీకి వచ్చే పిల్లలు వారు తీసుకొని వచ్చే వాటర్ బాటిల్ తీసుకొని రాకుండా చూడాలని అదేశించారు. కాచి చల్లార్చిన వేడి నీరు పిల్లలకు పట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఓపిఆర్డి శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రీధర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద, అంగన్‌వాడీ సిబ్బంది మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

**– డాక్టర్ సలాది జ్యోతిర్మయి**
**– ఎన్.సి.సి. విద్యార్థులు ర్యాలీ**




**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** థర్డ్ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ కాకినాడ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా మూడవ ఏపీఎస్పీ బెటాలియన్ ఆవరణలో జరిగిన అవగాహనా కార్యక్రమానికి ప్రముఖ క్యాపిటల్ హాస్పిటల్ వైద్యురాలు సలాది జ్యోతిర్మయి ముఖ్య అతిగా విచ్చేసి ఎన్.సి.సి. విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, నిర్మూలనపై ప్రసంగించారు. అనంతరం ప్లకార్డులు, బ్యానర్లు తో ఎపిఎస్పీ నుండి సర్పవరం జంక్షన్ మీదగా బోట్ క్లబ్ థర్డ్ గర్ల్స్ బెటాలియన్ వరకు థర్డ్ ఆంధ్రా, 9 ఆంధ్రా, 18 ఆంధ్రా ఎన్.సి.సి. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సిసి 18 ఆంధ్రా అధికారి మేజర్ ఆసిఫ్, 3 ఆంధ్రా బెటాలియన్ నుండి సుబేదర్ లక్ష్మణరావు, పిఐ స్టాఫ్, జిసిఐ పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

## కౌలు రైతులకు కౌలు హక్కు గుర్తింపు కార్డులు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపురం మండలం ఏడిఏ ఎన్.దైవకుమార్ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి, అగ్రికల్చర్ అధికారి కె.సంజయ్‌కుమార్‌ల పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం పెద్దాపురం తహశీల్దార్ కార్యాలయంలో విహెచ్ఏ, విఏఏ, వీఆర్వోలకు కౌలు రైతుల కార్డుల మంజూరు నిమిత్తం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు సాగుచేసే ప్రతీరైతుకు కౌలు కార్డు ఇవ్వాలని, ఈ విషయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎడిఏ ఎన్.దైకుమార్ తెలుపుతూ కౌలు కార్డుల ద్వారా రైతులకు పంట నమోదు, ఉచిత పంటల భీమా, పంట నష్టపరిహారం, విత్తనాలు, ఎరువులు వంటివి రైతులకు అంతుదాయని తెలిపారు ఏఓ కె.సంజయ్‌కుమార్ తెలుపుతూ గ్రామస్థాయిలో వందశాతం కౌలు కార్డుల ప్రగతి సాధించాలని, తద్వారా రైతులు బ్యాంక్‌లోన్ పొందుతారని, ఈ విధంగా రైతులకు ఆర్ధికంగా సహాయపడుతుందని ఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, ఏఇఓ ఎన్.ప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు త్రాగునీటి ప్లాంట్‌లను పరిశీలించిన కమీషనర్ పద్మావతి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లాలో పలు ప్రాంతాలలో అతిసారం కేసులు నమోదవుతున్న నేపధ్యంలో జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో బుధవారం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు ఆధ్వర్యంలో పట్టణంలో గల ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా త్రాగునీటిలో క్లోరినేషన్, త్రాగునీటి ట్యాంక్‌లను శుభ్రంగా ఉంచాలని, శుద్దజలం డబ్బాలు శుభ్రం చేయాలని, వారు సూచించారు. అలాగే వాటర్ ప్లాంట్ వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలని సంబంధిత వాటర్ ప్లాంట్ యజమానులకు సూచించడం జరిగింది. పట్టణంలో 8 ప్రైవేట్ వాటర్‌ప్లాంట్‌లను గుర్తించడం జరిగిందని, వీటన్నిటిని పరిశీలించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## జగ్గంపేట సాయి హెల్త్ కేర్ నందు ఆరోగ్యశ్రీ పథకం పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**– గైనకాలజీ, చంటి పిల్లల విభాగం, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, చెవి ముక్కు గొంతు విభాగాలకు ఆరోగ్యశ్రీ సేవలు**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక రాజమండ్రి రోడ్‌లో గల సాయి హెల్త్ కేర్ నందు పలు వైద్య విభాగాలకు వర్తించేలా ఆరోగ్యశ్రీ పథకంలో ప్రారంభించిన జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట ప్రాంతంలో సాయి హాస్పిటల్ బ్రాంచి ప్రారంభించి పలు వైద్య సేవలు అందిస్తున్న సాయి హాస్పిటల్ అధినేత విజయ్ కుమార్‌కి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. ఎమ్మెల్యేగా మొట్టమొదటి ప్రారంభోత్సవం పేదలకు ఉచితంగా వైద్యం అందించే ఆరోగ్యశ్రీని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీలో గైనకాలజీ, చిన్నపిల్లల విభాగం, జనరల్ సర్జరీ, ఇఎన్టి వంటి ముఖ్యమైన విభాగాలకు ఆరోగ్యశ్రీ వర్తించడం ఈ ప్రాంత ప్రజలకు శుభపరిణామని అదేవిధంగా నేను ఎన్నికల హామీ గా ఇచ్చిన కార్పొరేట్ హాస్పిటల్ నిర్మాణానికి విజయ్ కుమార్ కూడా సహాయ సహకారాలు అందిస్తానని తెలపడం సంతోష్ మని అన్నారు. హాస్పిటల్ ఎండి విజయ్ కుమార్ మాట్లాడుతూ పట్టుదల కార్యదీక్షతా గల వ్యక్తి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అని మేము చదువుకునేటప్పటి నుంచి ఆయన చేస్తున్న ప్రజా సేవ కార్యక్రమాలు చూస్తూనే పెరిగే మని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, కొత్త బైరవ కృష్ణ, కొత్త కొండబాబు, ముండ్రుఎర్రబాబు, వేములకొండ జోగారావు, తులా రాము, కందుల బాబ్జి, కంటే సురేంద్ర, య ర్రంశెట్టి బాబ్జి, ఉండవల్లి వర ప్రసాద్, బొండా రాజేష్, రాయి సాయి, సాంబ తుల చంద్రశేఖర్, ఉప్పలపాటి బులబ్బు, సేవా బుల్లి దొర, చాట్ర రాజు జగ్గారావు, వల్లెపు అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎనీమియా ముక్తి భారత్‌అమలుపై కేంద్ర బృంద సభ్యులు జితేంద్ర సింగ్ మరియు ఎస్. పూజ

**– రక్తహీనత నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం**
**– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కే.వెంకటేశ్వరరావు**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజలు బలవర్ధకమైన ఆహారం ఆకుకూరలు, కాయగూరలు, బెల్లం, పప్పు దినుసులు వంటివి ఆహారం తీసుకోవడం వలన హిమోగ్లోబిన్ శాతం పెరిగి తద్వారా రక్తహీనతను అధిగమించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కే. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా లో ఎనీమియా ముక్తి భారత్ అమలు పై కేంద్ర బృంద సభ్యులు జితేంద్ర సింగ్ మరియు ఎస్. పూజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో డా. కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో అనీమియా ముక్తి భారత్ అమలు తీరును పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందం పరిశీలకులు జితేంద్ర సింగ్ మరియు ఎస్. పూజ సంబంధిత ప్రోగ్రాం ఆఫీసర్లతో అమలవుతున్న ఎనిమియా ముక్తి భారత్ పనితీరును గురించి అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. కేంద్ర బృంద సభ్యులు పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎనిమియా ముక్తి భారత్ కార్యక్రమం ఏ విధంగా అమలు జరుగుతుందో పిహెచ్సి వైద్యులు డాక్టర్ బెండిక్ట్ గారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాలచర్ల లో ఉన్న ప్రాథమిక పాఠశాలను మరియు అంగన్వాడీ సెంటర్ ను సందర్శించి ఈ కార్యక్రమంలో స్కూల్ పిల్లలకు అందించే ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రమే గురించి మరియు అంగన్వాడి సెంటర్ల నందు ఐదు సంవత్సరముల లోపు పిల్లలకు వారమునకు రెండు రెండుసార్లు ఇచ్చే ఐఎఫ్ఏ సిరప్ల గురించి తెలుసుకున్నారని తెలిపారు. తదుపరి... సాటిలైట్ సిటీ– 3 నందు ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్స్ నందు, అంగనవాడి సెంటర్ నందు అమలవుతున్న కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారని తెలిపారు. రక్తహీనత నివారణే లక్ష్యంగా ఆకుకూరలు, కాయగూరలు, బెల్లం, పప్పు దినుసులు వంటి బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకునే విధంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృంద సభ్యులు రక్తహీనతను పూర్తిగా అరికట్టడానికి చిన్నపిల్లలకు, కౌమార దశలో ఉన్న పిల్లలకు మరియు గర్భిణీ స్త్రీల లో ఉన్న రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి తగిన విధంగా ఐ ఎఫ్ ఏ మందులను అందించాలని సూచించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీవియర్ ఎనీమియా ఉన్న కేసులను గుర్తించి వారికి ఐరన్ సుక్రోస్ ను సెలైన్ ద్వారా ఎక్కించడం గురించి మరింత తీవ్ర స్థాయిలో ఉన్న రక్తహీనత కలిగిన వారిని రెఫరల్ ఆసుపత్రి కి పంపించి తగిన విధంగా చికిత్స చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి డా. ఎన్. రాజకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. మౌనిక ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం ఆఫీసర్ డా. హరిచంద్ర ప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఎన్ టీ ఆర్ భరోసా పెన్షన్ పంపిణీ జూలై 1 వ తారీఖు న పంపిణీ చేయు నిమిత్తం పూర్తి స్థాయిలో సన్నద్ధం కావడం జరిగిందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ వి వి ఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మొత్తం మీద వివిధ కేటగిరిల క్రింద మొత్తం 18 రకాల పెన్షన్ లు అందచేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వృధ్యాప్య, వితంతు, ఒంటరిమహిళ, వీవర్స్ కల్లుగీత కార్మికులు, ఫిషర్ మాన్, కోబ్లేర్స్, ట్రాన్స్ జెండర్, డప్పు కళాకారులు, పై కేటగిరి చెందినవారికి పెన్షన్ 3,000 నుండి 4,000 లకు పెంచుతూ మరియు వికలాంగుల, లెప్రసీ, పెన్షన్ లు వారికి 3000 నుండి 6000 లకు పెంచుతూ పూర్తి డిజేబులిటి, మస్కిలర్ జిస్ట్రోఫి, పెరాలసిస్ పెన్షన్ లు 5000 నుండి 15000 వరకు పెంచుతూ మరియు కిడ్నీ, లివర్, హార్ట్, ట్రాన్స్ప్లాంట్, డయాల్సిస్ పెన్షన్స్ ను 5000 నుండి 10000 పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తరువుల ప్రకారం జిల్లాలో మొత్తం పెన్షన్స్ 2,44,302 లకు రూ .165.13 కోట్లు జూలై 1వ తేదీ నుండి ప్రజాప్రతినిధుల సమక్షంలో పండుగ వాతావరణంలో సచివాలయ ఉద్యోగుల చేత పంపిణీ చేయుట జరుగుతున్నట్లు తెలిపారు. ఈ నేపధ్యంలో బ్యాంకు బ్రాంచ్ వారిగా నగదుకు సంబంధించిన వివరాల లిస్టు ప్రభుత్వం నుండి రావడం జరిగిందన్నారు. ఆమేరకు ది .29.06.2024 న పై నగదును ప్రభుత్వం నుండి బ్యాంకు నందు జమ చేయబడును. జమ చేయబడిన నగదును పంచాయితీ సెక్రటరీ వారు విత్ డ్రా చేసి 2024 జూలై ఒకటవ తేదీన ఉదయం 6 గం. నుండి సచివాలయ సిబ్బంది చే పెన్షన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభమగునని మూర్తి తెలియ చేశారు.

## శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాఢ మాస జాతరకు ఏర్పాట్లు

**– భక్తులకు సౌకర్యాలు కల్పించాలి– ఆర్డీఓ జె.సీతారామారావు**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న ఉభయ తెలుగు రాష్ట్రాల కోరిన కోర్కెలు తీర్చే శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాఢ మాస జాతర మహోత్సవాలు జూలై 5వ తేదీ నుండి ఆగష్టు 10వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించబడుతుందని, దీనిలో భాగంగా బుధవారం ఆర్డీఓ జె.సీతారామారావు అధ్యక్షతన వివిధ శాఖల సమన్వయ కమిటి సమావేశం మరిడమ్మ దేవస్థానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానంలో ఏర్పాట్లు చేయాలని దేవస్థాన సిబ్బందికి సూచించారు. అలాగే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేకంగా దేవస్థానం ఆవరణలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహించాలని సూచించారు. మున్సిపాల్టీ ఆధ్వర్యంలో శానిటేషన్‌కు, త్రాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఎలక్ట్రికల్, ఫైర్, ఆర్టీసి సిబ్బంది సమన్వయంతో జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త చింతపల్లి బ్రహ్మాజీ, దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు, ఎస్సై వెలుగుల సురేష్, వైద్యులు డా.అనూషరాయ్, డా.నిహారిక, డా.వంశీ, ఎలక్ట్రికల్ ఏఇ శ్రీరామచంద్రమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఫైర్ సిబ్బంది ప్రసాద్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాలు పాడు చేసుకోవద్దు




**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం పట్టణంలో బుధవారం సాగర్ కాలేజి నందు అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలలో భాగంగా విద్యార్ధులకు చెడు వ్యసనాల వచ్చే అనర్థాలను విద్యార్థులకు పెద్దాపురం సెబ్ సిఐ ఏ.యు.బి.సుబ్రహ్మణ్యం, ఎస్సై వి.వి.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సిబ్బంది తెలుపుతూ కాకినాడ జిల్లా సెబ్ ఎస్పి శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, దీనిలో భాగంగా యువత డ్రగ్స్‌కు, మత్తు పానీయాలకు అలవాటు కాకుండా ఉండాలని, వాటి వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. అలాగే డ్రగ్స్ సేవించడం వల్ల, మత్తు పానీయాలకు అలవాటు పడడం వల్ల యువత తమ భవిష్యత్ పాడుచేసుకుంటున్నారని తెలిపారు. మత్తు పానీయాలు సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొని నష్టపోతున్నారని, యువత మత్తుకు బానిసలు కాకుండా డ్రగ్స్‌కు దూరంగా ఉంటే మంచి ఫలితాలు సాధిస్తారని, ఎస్ఇబి సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "మాదక ద్రవ్యాల నిషేధం"పై విద్యార్థులకు అవగాహన



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** వివేకానంద ఐటిఐ కాలేజ్ నందు అంతర్జాతీయ మత్తు పదార్థాల,మద్యపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సౌత్ జోన్ డీఎస్పీ విద్యార్థులకు అవేర్నెస్ ప్రోగ్రాం కండక్ట్ చేశారు. ఈ ప్రోగ్రాం నందు ధవళేశ్వరం సిఐ గారు మరియు ఎస్సై గారు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
గురువారం
27 జూన్ 2024


## శ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆర్డీఓ సీతారామారావు



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** బుధవారం శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ మరియు కార్య నిర్వాహణాధికారి సిహెచ్.రామ మోహనరావు పర్యవేక్షణలో వేదపండితులు ఆర్డీఓ సీతారామారావుకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు అందజేసి అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## శాఖా గ్రంధాలయానికి పోటీపరీక్షల పుస్తకాలు బహుకరణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంధాలయానికి పాఠకులకు సౌకర్యార్థం పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ యువ వ్యాపారవేత్త జిగిని రాజేష్‌ఖన్నా పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి, గ్రూప్-2, రైల్వే, డిఎస్సీ, గ్రూప్-1 పుస్తకాలు, ప్యాడ్‌లను బుధవారం బహుకరించారని గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు దాత జిగిని రాజేష్ ఖన్నాను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, రిటైర్డ్ ఉద్యోగి గంధం అప్పారావు, పాఠకులు కొమ్మన అప్పారావు, ఎన్.భద్రరావు, బి.అరవింద్, రామారావు, వానపల్లి సత్యనారాయణ, జయరామ్, డి.శ్రీనివాసరావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుపదార్థాలకు బానిసై జీవితాలు పాడు చేసుకోవద్దు

**- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినం సందర్భంగా రామచంద్రపురం పట్టణంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల రామచంద్రపురం డిఎస్పి బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.దొర రాజు, రామచంద్రపురం ఎస్సై కె.సురేష్ బాబు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో పోలీసులు రామచంద్రపురం పట్టణంలోని వి.ఎస్.ఎం. కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్డీవో ఎస్ సుధాసాగర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ యుక్త వయసులో చెడు వ్యసనాలకులోను కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ ఎదిగే వయసులో ఉన్న పిల్లలకు, యువకులకు సరైన అవగాహన లేక తప్పుడు మార్గంలో వెళ్లి మత్తుపదార్థాలకు




బానిసలై జీవితాలు పాడు చేసుకుంటారని, మాదకద్రవ్యాల వినియోగం మరియు రవాణా తీవ్రమైన నేరాలని, వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు.

తాసిల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టెన్త్ క్లాస్ మరియు ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థులు తప్పుదోవ పడుతూ ఉంటారని, ఈ వయసులో క్రమశిక్షణతో జీవించాలని సూచించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.దొర రాజు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను



వివరించారు. ఎస్ఈబి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫణికుమార్ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.

అనంతరం పట్టణంలో విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, అధికారులు, నాయకులు విద్యార్థినీవిద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కి బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** యువత డ్రగ్స్ కి బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దని రావులపాలెం రూరల్ సి.ఐ ఎమ్.రామ్ కుమార్ అన్నారు.అంతర్జాతీయ మాధకద్రవ్యాల రహిత దినం సందర్భంగా కొత్తపేట ఎస్.ఐ ఎమ్.అశోక్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దనుండి బస్టాండ్ సెంటర్ వరకు మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సంధర్భంగా సి.ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు.యువత విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సూచించారు.డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. గంజాయి,గుట్కాలు,మత్తుపదార్థాలు ఎవరైనా విక్రయాలు జరిపితే వారి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం ఎస్.ఐ శ్రీనివాస్,స్టేషన్ సిబ్బంది, మహిళ పోలీసులు,తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి వారి నాలుగవ వార్షికోత్సవ వేడుకలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** అన్నవరప్పాడు గ్రామంలో 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో వేంచేసియున్న శ్రీ ఆంజనేయ స్వామి వారికి నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 26వ తేదీ బుధవారం మల్లేశ్వరం వాస్తవ్యులు వల్లూరి రామ గోవిందరావు శ్రీమతి సూర్యకుమారి దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## స్కేటింగ్ పోటీలలో తమదైన సత్తా చాటిన బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యార్థులు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఈ నెల 21 నుంచి 24 వరకూ కాకినాడలో జరిగిన ఫస్ట్ స్టేట్ జోనల్ ర్యాంకింగ్ ఓపె న్ ఛాంపియన్ షిప్-2024 జోన్-2 వైయస్ఆర్ ఇంటర్నేషనల్ స్కేటింగ్ స్టేడియంలో రాజమ హేంద్రవరం జెఎన్రోడ్డులో బిర్లా ఓపెన్మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు తమదైన సత్తాచాటారని డైరెక్టర్ ఎన్ అపూర్వ ప్రిన్సిపల్ బి శ్రీదేవి స్కేటింగ్ కోచ్ కెల్లా లక్ష్మణ్ పేర్కొన్నా రు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులు యు శ్రీవాత్సవ్, సిహెచ్ వర్షిత్ ఉమేశ సతీష్, లక్ష్మీనారా యణ వీరిలో యు శ్రీవాత్సవ్ 5-7 క్వాడ్ విభాగంలో 1 స్వర్ణపథకం, 1 వెండి పథకం సాధి ంచగా సిహెచ్ వర్షిత్ 7-9 ఇన్లైన్ విభాగంలో 1 కాంస్య పథకం సాధించారని స్కేటింగ్ కోచ్ కెల్లా లక్ష్మణ్ పేర్కొన్నారు. వీరు భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని స్కూలుకి మరింత మంచి పేరు తీసుకురావాలని వీరిని స్ఫూర్తిగా తీసుకుని వీరంతా మంచి విద్యార్థుల ను తయారు చేస్తారని హామీ ఇచ్చారు. వీరు మరిన్ని పథకాలను సాధించాలని బిర్లా ఓపెన్ మైండ్స్ ప్రిన్సిపల్ శ్రీదేవిగారు. డైరెక్టర్ అపూర్వ గారు, స్కేటింగ్ కోచ్ కెల్లా లక్ష్మణ్ గారినిమరి యు విద్యార్థులను అభినందించారు.

## వేట్లపాలెంలో మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం వేట్లపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ను మండల విద్యాశాఖ అధికారి 2 పి పుల్లయ్య బుధవారం మధ్యాహ్నం భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి 2 పి. పుల్లయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో రాజీ పడకుండా విద్యార్థులందరికీ మంచి పౌష్టికాహారం అందించాలని కోరారు ఇంప్రూవ్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నాడు నేడు పనులను పరిశీలించారు పాఠశాల పరిసరాలను ,మధ్యాహ్నం భోజ నం తయారు చేయు ప్రదేశములను, పాత్రలను ,రిజిస్టర్‌లను పరిశీలించడం జరిగినది. నాడు నేడు వర్క్‌ను పరిశీలించడం జరిగింది.సీజనల్ వ్యాధులు ప్రభులుతున్న సందర్భంగా తీసుకోవల సిన జాగ్రత్తలను తెలియచేయడం జరిగినది. నేను వెంట హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయిని పి అనురాధ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీవి ఎస్వీఆర్ ఎం స్కూల్లో స్టూడెంట్ కిట్లు పంపిణీ

**పాలకొల్లు,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న స్టూడెంట్ కిట్స్ ను బుధవారం పాలకొల్లు జివి.ఎస్వీ.ఆర్.ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రాయపడి భవానీ శంకర ప్రసాద్ పర్యవేక్షణలో పంపిణీ చేశారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, షూ, టై తదితర విద్యా సామగ్రిని అంద చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులు, హెచ్ఎం రాయపూడి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటుగా, చక్కటి క్రమశిక్షణ నేర్పడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు ధనాని సూర్య ప్రకాష్. టిడిపి వార్డు ఇన్చార్జి మజ్జి శంకరం, పాలకొల్లు జనసేన అధ్యక్షులు శిడగం సూరి, ఉపాధ్యక్షులు విన్నకోట గోపి తదితరులు పాల్గొన్నారు.

# రాక్షస పాలన ముగిసింది ధర్మ పాలన ప్రారంభమైంది




**- టీడీపీ నాయకులు**

ఎటపాక, మేజర్ న్యూస్ : రంపచోడవరం నియోజవర్గంలో రాక్షస పాలన ముగిసింది అని, ధర్మ పాలన మొదలైందని ఎటపాక టిడిపి నాయకులు అన్నారు. రంపచోడవరం నియోజవర్గంలో టిడిపి జెండా ఎగిరింది. రంపచోడవరం టిడిపి ఎమ్మెల్యే శిరీష దేవి శాసనసభలో ప్రమాణ స్వీకారం పూర్తిచేసుకుని రంపచోడవరంలో అడుగుపెట్టిన సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీని బుధువారం నిర్వహించారు. విజయోత్సవ ర్యాలీలో అరకు పార్లమెంట్ అధికారి ప్రతినిధి మువ్వా శ్రీనివాస్, మండల టిడిపి నాయకులు పుట్టి రమేష్ బాబు, టీడీపీ నాయకులు బాచినేని మలేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్, ఎటపాక గ్రామపంచాయతీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు పెద్దినేని వెంకటేశ్వర్లు, ముత్యం సురేష్ గౌడ్, పసుపులేటి రాంబాబు, గోసుల వీర్రాజు పాల్గొని రంపచోడవరం నియోజవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిని మర్యాదపూర్వకంగా కలిసి దు శాలువా కప్పి సన్మానించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే శిరీషకు ఎటపాక మండలంలో వున్న సమస్యలను వివరించడం జరిగింది. ఆమె స్పందించి త్వరలోనే ఆ సమస్యలపై దృష్టి పెడతానని, నన్ను గెలిపించిన ప్రజల సమస్యలను తీర్చుటకు తన వంతు కృషి చేస్తారని హామీ ఇచ్చారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని మండల టిడిపి నాయకులు అన్నారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ అధికారి ప్రతినిధి మువ్వ శ్రీనివాస్ మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో రాక్షస పాలన ముగిసిందని, ధర్మ పాలన మొదలైందని అన్నారు. ముఖ్యంగా టిడిపి ప్రభుత్వంలో పేద ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని, రంపచోడవరం నియోజవర్గం అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని, నియోజకవర్గంలో టీడీపీ గెలుపుతో అరాచక పాలన ముగిసింది అని ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారని ఆయన అన్నారు. నియోజవర్గంలో టిడిపి పార్టీకి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన అన్నారు.

## విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే దంపతులకు అడుగడుగున బ్రహ్మారథం




**రాజవొమ్మంగి,మేజర్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే శిరీష దేవి విజయోత్సవ ర్యాలీ తొలి తగ బాపనమ్మ తల్లి దర్శనం అనంతరం రంపచోడవరం లో ప్రారంభమై గంగవరం మీదుగా అడ్డతీగల, రాజవొమ్మంగి వరకు సాగింది. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, భాస్కర్ దంపతులను ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టి హారతులు ఇచ్చారు. పూలతో ముంచెత్తారు. ప్రజలు తనకు భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించినందుకు రుణపడి ఉన్నానని నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే శిరీష దేవి అన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీలో సాంస్కృతిక నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయక ఎమ్మెల్యే దంపతులు ప్రజలకు అభివాదాలు తెలిపారు. భారీ బాణ సంచా లతో ర్యాలీ సాగింది. అభిమానులు కేరింతల కొడుతూ ర్యాలీలో పాల్గొన్నారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు వేలాదిమంది విజయోత్సవర్యాలీలో ఉన్నారు.

# "మాదక ద్రవ్యాల నిషేధం" పై న్యాయ విజ్ఞాన సదస్సు



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : బుధవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్ బాబు గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాలలో "మాదక ద్రవ్యాల నిషేధం" పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయ మూర్తి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. చెడు స్నేహాల వల్ల కానీ, పరిస్థితుల కరణంగా కానీ మాదక ద్రవ్యాల ఉచ్చులో పడకూడదని, తాత్కాలిక ఆనందం కోసం వీటిని సేవించడం వల్ల అనేక రుగ్మతలకు గురవుతారని వివరించారు. "ఎస్.డి.పి.ఎస్. యాక్ట్, 1985" పై అవగాహన కల్పిస్తూ మాదక ద్రవ్యాలను కలిగి ఉండడం, సేవించడం, సరఫరా చేయడం, తయారీ, క్రయ విక్రయాలూ... అన్నీ క్రిమినల్ నేరాలు అని, వీటికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి నేరాలలో పట్టుబడితే వారి భవిష్యత్తు దెబ్బతింటుందని, కాబట్టి అందరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడిన వారు స్వయంగా సహాయం కోసం ముందుకు వస్తే వారిపై ఎటువంటి నేర విచారణ ఉండదని, వారి వ్యసనముక్తి కోసం ఉచిత వైద్య సహాయం అందించబడుతుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ "నల్సా మాదక ద్రవ్యాల బాధితులకు న్యాయ సేవలు మరియు మాదక ద్రవ్యాల నిషేధం, 2015" పథకం ద్వారా అందిస్తున్న సేవల గురించి ఆయన వివరించారు.ఈ సదస్సులో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు వి. సోమశేఖర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రరావు , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పారా లీగల్ వాలంటీర్స్‌కై ధరఖాస్తుల స్వీకరణ

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూ ఢిల్లీ వారు రూపొందించిన "పారా లీగల్ వాలంటీర్స్ పథకం"క్రింద ఒక సంవత్సర కాలం (నియామకము నుండి) పనిచేయుటకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నివాసుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసినారు.దరఖాస్తులు సమర్పించుటకు జూన్ 28వ తేదీ చివరి తేదీగా తెలియజేసినారు. కావున దరఖాస్తు ఫారములకై మీ దగ్గర లో గల న్యాయ సేవాధికార సంస్థ లేదా మండల న్యాయ సేవాధికార కమిటీల నందు గల అధ్యక్ష/కార్యదర్శి వారిని సంప్రదించగలరు.విద్యార్హతలు: మెట్రిక్యులేషన్ లేదా దానితో సరి సమానమైన అర్హత.

వయో పరిమితి: 18 సం.లు నిండినవారు

ఎంపిక విధానము : మౌఖిక ఇంటర్వ్యూ

దరఖాస్తు ఫారములు సమర్పించుటకు చివరి తేదీ : 28.06.2024

ఖాళీల వివరములు :

1. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం -50 మరియు
2. మండల న్యాయ సేవాధికార కమిటీలు, అమలాపురం కాకినాడ పెద్దాపురం పిఠాపురం రామచంద్రపురం రాజోలు తుని ఆలమూరు ముమ్మిడివరం కొత్తపేట అనపర్తి ప్రత్తిపాడు రంపచోడవరం అడ్డతీగల 25 (ఒక్కోక్క మండలములో)

దరఖాస్తు ఫారములకై మీ దగ్గరలో గల న్యాయ సేవాధికార సంస్థ లేదా మండల న్యాయ సేవాధికార కమిటీల నందు గల అధ్యక్ష/కార్యదర్శి వారిని సంప్రదించగలరు.

# నేడు వైసీపీ సమావేశం



**- మాజీ హోంమంత్రి అధ్యక్షత సమావేశం - ఓటమిపై సమీక్షించే అవకాశం**

**గోపాలపురం, మేజర్ న్యూస్:** సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి నియోజకవర్గంలో వైసీపీ సమావేశాన్ని నిర్వహించడానికి సిద్ధమైంది. నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం మధ్యహ్నం 3గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తానేటి వనిత అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పరాజయం పాలవ్వడానికి కారణాలను విశ్లేషించనున్నట్ల తెలిసింది. నిరాశలో ఉన్న కార్యకర్తలు, నాయకుల్లో ఉత్తేజాన్ని నింపి తిరిగి పార్టీ బలోపేతానికి ఏలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. తెదేపా ఇచ్చిన మ్యానిఫెస్టో అమల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఏ విధంగా మందుకు వెళ్లాలనే అంశాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు సమాచారం. ఆయా గ్రామాల, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# రహదారిపై పొంగిపొర్లుతున్న మురుగునీరు

**పెంటపాడు,మేజర్ న్యూస్:** పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో పాత ఆంధ్ర బ్యాంకు వద్ద మురుగునీరు రహదారిపై ప్రవహిస్తున్న అధికారులు పట్టి పట్టినట్టు ఉన్నారని ప్రజలు వాపోతున్నారు. చిన్న వర్షం కురిస్తే చాలు డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరు రహదారిపై ప్రయాణిస్తుంది. ఫలితంగా రహదారులు దెబ్బతింటున్నాయి. వేసవికాలంలో మురుగబోదు లలో షిల్టు తీయకపోవడం వల్ల వర్షాలు కురిసినప్పుడు అందులోని మురుగు నీటితోపాటు వ్యర్థాలు కూడా రహదారిపై ప్రవహిస్తున్నాయి. మురుగునీరు రహదారిపై ప్రయాణించడం వల్ల రహదారులు దెబ్బతినడంతో పాటు చిన్నారులు వృద్ధులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి మురుగుబోదులను శుభ్రపరచాలని ఫలితంగా అంటువ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్న వారవుతారని ప్రజల అభిప్రాయపడుతున్నారు. పాఠశాలలు ప్రారంభం కావడం ఆ రహదారిగా సుమారు ఎనిమిది పాఠశాలలకు చెందిన బస్సులు తిరుగుతూ ఉండడంతో నడకదారిన వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వర్షపు నీరు మురుగునీరు కలిసిపోయి వేరే వైపుకు వెళ్ళక లోతట్టు ప్రాంతాల్లో అక్కడే ఉండిపోతుందని తక్షణమే పంచాయతీ అధికారులు సంబంధించిన నాయకులు స్పందించాలని ప్రజల కోరుకుంటున్నారు.

ఒకవైపు నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం రహదారులపై ఇబ్బడి ముబ్బడిగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ నిన్న అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఇకనైనా అధికారులు అలసత్వం చూపకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సుచరితను హతమార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

**నరసాపురం,మేజర్‌న్యూస్:**బాపట్లజిల్లా చీరాల మండలం ఈపురుపాలెం గ్రామంలో చేనేత బిడ్డ, పముజుల సుచరితపై అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఆమెను రేప్ చేసి చంపిన హంతకులకు వెంటనే కఠినంగా శిక్షించాలని స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఏఓ రామకృష్ణకి వినతిపత్రం అందజేసారు. బుధవారంవీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వీవర్స్ యూనైటెడ్ ఫ్రెండ్ జిల్లా కన్వీనర్ కనకం వరప్రసాద్,నరసాపురంపట్టణకార్యదర్శి ఒగ్గు సత్యనారాయణలు మాట్లాడుతూ చీరాల దగ్గరలో ఈపురుపాలెం గ్రామంలో శుక్రవారం కుమారి సుచరితపై జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఆమెను రేప్ చేసి చంపిన కిరాతక హంతకులకు వెంటనే కఠినంగా శిక్షించాలని ఈ శిక్ష చూసి మరి ఎవరు ఆడపిల్లల జోలికి వెళ్లడానికి భయపడే విధంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో వీవర్స్ యూనిటెడ్ ఫ్రంట్ కోశాధికారి సమతం శివప్రసాద్ కర్ణభక్తుల అధ్యక్షులు సమతం వెంకటేశ్వర్లు పద్మశాలీల అధ్యక్షులు ఒగ్గు సత్యనారాయణ కరికాల భక్తుల అధ్యక్షులు మోటూరి దుర్గాప్రసాద్ అతుకుల ప్రసాద్, ఊటుకూరి దుర్గాప్రసాద్,రాపర్తిసత్యనారాయణ,ఆకురాతి భీమేశ్వరరావు, లింగరాజు భవానీ ప్రసాద్,దేశెట్టి సత్యనారాయణ, బూడిద జోగేశ్వరరావు,దొడ్డిపట్ల శ్రీను, అల్లం సూరి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి మౌలిక సదుపాయాలు కల్పించాలి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని దీనికి నిధులు మంజూరు చేయాలని బుధవారం జిల్లా కలెక్టర్ సగిలి సన్మోహన్ కలిసి వినతి పత్రం అందించినట్లు జిల్లా యువజన సంఘం ల కార్యదర్శి మరియు జిల్లా ఆర్టీఐ మేంబర్ గేదెల శ్రీనివాస్ తెలిపారు సందర్భంగా జిల్లా కలెక్టర్కు వివరిస్తూ కాకినాడ ప్రభుత్వ హాస్పటల్ కొన్ని మౌలిక వసతులకు నిధులు మజూరు చేసి ప్రజలకు మెరుగైన అయిన వసతులు కావాలి అని కోరారు ఏమర్జన్స్ వార్డ్ నీ విస్తరించాలని కోరాగా అందుకు కలర్టు కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించారని గేదెల శ్రీనివాస రావు విలేకరులకు తెలిపారు.